చమరీ కొత్త చరిత్ర

195 పరుగులతో అద్భుత సెంచరీ

వన్డే లక్ష్యఛేదనలో శ్రీలంక నయా రికార్డు

పొచెఫ్‌స్ట్రూమ్: మహిళల వన్డే క్రికెట్‌లో మరో సంచలనం! శ్రీలంక క్రికెట్ దిగ్గజం చమరీ ఆటపట్టు కొత్త చరిత్ర లిఖించింది. బుధవారం అర్ధరాత్రి(భారత కాలమానం ప్రకారం) దక్షిణాఫ్రికాతో జరిగిన మూడో వన్డేలో చమరీ(139 బంతుల్లో 195 నాటౌట్, 26ఫోర్లు, 5 సిక్స్‌లు) చిరస్మరణీయ సెంచరీతో చెలరేగింది. దక్షిణాఫ్రికా నిర్దేశించిన 302 పరుగుల లక్ష్యఛేదనలో బరిలోకి దిగిన లంక 44.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 305 పరుగులు చేసింది. ఓపెనర్ విశ్మి గుణరత్నె(26) నిరాశపర్చగా, చమరీ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో జట్టుకు ఇరుసుగా నిలబడింది. సఫారీ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ ఆటపట్టు సాధికారిక ఇన్నింగ్స్‌తో కదంతొక్కింది. ప్రసాదిణి(4), హన్సిమ కరుణరత్నె(3), కవిశ(0) సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితం కాగా, నీలాక్షిక సిల్వా(50 నాటౌట్)తో కలిసి ఆటపట్టు జట్టును గెలుపు తీరాలకు చేర్చింది. తన ఇన్నింగ్స్‌లో 26 ఫోర్లు, 5 సిక్స్‌లతో చెలరేగిన చమరీ..శ్రీలంక తరపున వన్డేల్లో అత్యధిక వ్యక్తిగత పరుగులు చేసిన బ్యాటర్‌గా రికార్డుల్లోకెక్కింది. దీనికి తోడు మహిళల వన్డే చరిత్రలో అత్యధిక పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన జట్టుగా శ్రీలంక నిలిచింది. తొలుత కెప్టెన్ లౌరా వోల్వార్డ్(184 నాటౌట్) అజేయ సెంచరీతో దక్షిణాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 301/5 స్కోరు చేసింది. ఈ నిర్ణయాత్మక మూడో వన్డేలో శ్రీలంక 6 వికెట్లతో ఘన విజయం సాధించింది.

చమరీ ఆటపట్టు (195*)

పంజాబ్ పోరాడినా ముంబైదే పైచేయి

సూర్య హాఫ్ సెంచరీ.. రాణించిన బుమ్రా, కొయెట్జీ

ఐపీఎల్‌లో మరోపోరు అభిమానులను ఊపేసింది. ఆధిక్యం చేతులు మారుతూ సాగిన అద్భుత పోరులో పంజాబ్ పోరాడినా..ముంబైదే పైచేయి అయ్యింది. ముంబై నిర్దేశించిన 193 పరుగుల లక్ష్యఛేదనలో బుమ్రా ధాటికి 49 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన పంజాబ్..అశుతోష్‌శర్మ, శశాంక్‌సింగ్ పోరాటపటిమతో పుంజుకుంది. అసలు గెలుపు ఆశలు లేని స్థితి నుంచి ముంబైకి ముచ్చెమటలు పట్టిస్తూ ముల్లాన్‌పూర్‌లో అశుతోష్ సిక్సర్లతో చెడుగుడు ఆడుకున్నాడు. బుమ్రా విజృంభణకు కొయెట్జీ జత కలువడంతో ముంబై ఆఖరి ఓవర్లో విజయాన్నందుకుంది. సూర్యకుమార్‌కు తోడు రోహిత్‌శర్మ, తిలక్‌వర్మ ముంబై పోరాడే స్కోరు అందుకుంది.

ముల్లాన్‌పూర్ : ముల్లాన్‌పూర్ వేదికగా పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ 9 పరుగుల తేడాతో నెగ్గింది. ఆల్‌రౌండ్ షో తో ఆకట్టుకున్న ఆ జట్టు బ్యాటింగ్‌లో సూర్యకుమార్ యాదవ్ (53 బంతుల్లో 78, 7 ఫోర్లు, 3 సిక్సర్లు), రోహిత్ శర్మ (36) మెరుపులు మెరిపించడంతో 7 వికెట్లు కోల్పోయి 192 పరుగులు చేసింది. భారీ ఛేదనలో పంజాబ్ 111 పరుగులకే 7 వికెట్లు కోల్పోయినా అశుతోష్ శర్మ (28 బంతుల్లో 61, 2 ఫోర్లు, 7 సిక్సర్లు) అద్వితీయ పోరాటానికి శశాంక్ సింగ్ (41) మెరుపులతో ఆ జట్టు విజయానికి చేరువగా వచ్చినా 19.1 ఓవర్లలో 183 పరుగుల వద్దే ఆగిపోయింది. ముంబై బౌలర్లు బుమ్రా (3/21),కొయెట్జి (3/32) పంజాబ్ పతనాన్ని శాసించారు. బుమ్రాకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

బుమ్రా (3/21)

సూర్య-హిట్‌మ్యాన్ షో..

ముంబైకి రబాడా మూడో ఓవర్లోనే కిషన్ (8)ను ఔట్ చేసి తొలి షాకిచ్చినా సుదీర్ఘ ఐపీఎల్ కెరీర్‌లో 250వ మ్యాచ్ ఆడుతున్న రోహిత్‌తో కలిసి సూర్య మెరుపులు మెరిపించాడు. క్రీజులోకి రావడంతోనే బౌండరీల వేట మొదలుపెట్టిన సూర్య.. స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. హిట్‌మ్యాన్ కూడా వీలుచిక్కినప్పుడల్లా బంతిని స్టాండ్స్‌లోకి పంపాడు. అర్ష్‌దీప్ వేసిన నాలుగో ఓవర్లో డీప్ మిడ్ వికెట్ మీదుగా భారీ సిక్సర్ బాదాడు. కరన్ వేసిన 12వ ఓవర్లో బ్యాక్‌వర్డ్ పాయింట్ వద్ద హర్‌ప్రీత్‌క్యాచ్ ఎత్తులో వచ్చిన క్యాచ్‌ను అందుకోవడంతో రోహిత్ ఔటయ్యాడు. ఈ జోడీ రెండో వికెట్‌కు 57 బంతుల్లోనే 81 పరుగులు జోడించింది. రోహిత్ స్థానంలో వచ్చిన తిలక్ వర్మ (34 నాటౌట్)తో కలిసి సూర్య బాదుడు కొనసాగించాడు. రబాడా ఓవర్లో ఓ ఫోర్, రెండు సిక్సర్లతో 18 రన్స్ పిండుకున్నారు. 28 బంతుల్లోనే 49 పరుగులు జతచేసిన ఈ జోడీని 17వ ఓవర్లో కరన్ విడదీశాడు. హార్దిక్ పాండ్యా (10) మరోసారి విఫలమయ్యాడు.

వణికించిన బుమ్రా

భారీ ఛేదనలో పంజాబ్.. తొలి ఓవర్ వేసిన గెరాల్డ్ కొయెట్జీ.. ప్రభ్‌సిమ్రన్‌ను ఔట్ చేసి వికెట్ల పతనానికి శ్రీకారం చుట్టాడు. రెండో ఓవర్ వేసిన బుమ్రా.. రెండు కీలక వికెట్లు తీసి ఆ జట్టు కోలుకోనీయకుండా చేశాడు. నాలుగో బంతికి రూసో (1)ను యార్కర్‌తో క్లీన్‌బౌల్డ్ చేసిన అతడు.. ఆఖరి బంతికి కరన్‌ను పెవిలియన్‌కు పంపాడు. ప్రమాదకర లివింగ్‌స్టోన్ (1) కొయెట్జీ మూడో ఓవర్లో అతడికే క్యాచ్ ఇచ్చాడు. దీంతో ఆ జట్టు 2.1 ఓవర్లలో 14 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది. హర్‌ప్రీత్ (13)ను స్పిన్నర్ శ్రేయస్ ఏడో ఓవర్లో పెవిలియన్‌కు పంపాడు.

ఆఖర్లో ఉత్కంఠ..

ఆకాశ్ మధ్వాల్ 16వ ఓవర్లో అశుతోష్ మూడు సిక్సర్లతో రెచ్చిపోగా బ్రర్ సైతం ఓ సిక్సర్ బాదాడు. ఈ ఓవర్లో మొత్తం 24 పరుగులొచ్చాయి. కానీ బుమ్రా వేసిన 17వ ఓవర్లో మూడు పరుగులే రాగా కొయెట్జీ 18వ ఓవర్లో తొలి బంతికే డీప్ మిడ్ వికెట్ వద్ద నబీకి అశుతోష్ క్యాచ్ ఇచ్చాడు. 12 బంతుల్లో ఆ జట్టు విజయానికి 23 పరుగులు అవసరం కాగా హార్దిక్ వేసిన 19వ ఓవర్లో బ్రర్ వికెట్ కోల్పోయినా పంజాబ్ 11 పరుగులు రాబట్టడంతో ఆఖరి ఓవర్లో ఉత్కంఠకు దారితీసింది. రెండో పరుగు తీయబోయి రబాడా రనౌట్ అవడంతో ఆ జట్టు ఓటమివైపు నిలిచింది.

సూర్యకుమార్ (78)

అశుతోష్ (61)

అశుతోష్ అదుర్స్..

గత మూడు మ్యాచ్‌లలో పంజాబ్ బ్యాటింగ్‌కు వెన్నెముకగా మారిన అశుతోష్ శర్మ, శశాంక్ సింగ్ మరోసారి పంజాబ్‌ను ఆదుకున్నారు. శశాంక్.. శ్రేయస్ 9వ ఓవర్లో రెండు భారీ సిక్సర్లతో రెచ్చిపోయాడు. అశుతోష్ ఎదుర్కొన్న రెండో బంతినే సిక్సర్‌గా మలిచాడు. షెపర్డ్ 10వ ఓవర్లో 4,6 చెలరేగాడు. ఈ ఇద్దరి దూకుడుతో లక్ష్యం దిశగా సాగుతున్న పంజాబ్‌ను బుమ్రా మరోసారి దెబ్బకొట్టాడు. 13వ ఓవర్లో రెండోసారి బౌలింగ్‌కు వచ్చిన బుమ్రా.. శశాంక్‌ను ఔట్ చేయడంతో 34 పరుగుల ఏడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. కానీ శశాంక్ ఔట్ అయినా అశుతోష్ మాత్రం పోరాటాన్ని ఆపలేదు. తనదైన షాట్లతో అభిమానులను హోరెత్తించాడు. ఈ క్రమంలో అతడు 23 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తిచేశాడు. హర్‌ప్రీత్ బ్రర్ (21) అతడికి అండగా నిలిచాడు.

సంక్షిప్త స్కోర్లు

ముంబై : 20 ఓవర్లలో 192/7 (సూర్య 78, రోహిత్ 36, హర్షల్ 3/31, కరన్ 2/41). **పంజాబ్ :** 19.1 ఓవర్లలో 183 (అశుతోష్ 61, శశాంక్ 41, బుమ్రా 3/21, కొయెట్జీ 3/32)

పాయింట్ల పట్టిక

జ	ఆ	గె	ఓ	ర	పా
రాజస్థాన్	7	6	1	0.67	12
కోల్‌కతా	6	4	2	1.39	8
చెన్నై	6	4	2	0.72	8
హైదరాబాద్	6	4	2	0.50	8
లక్నో	6	3	3	0.03	6
ఢిల్లీ	7	3	4	-0.07	6
ముంబై	7	3	4	-0.13	6
గుజరాత్	7	3	4	-1.30	6
పంజాబ్	7	2	5	-0.25	4
బెంగళూరు	7	1	6	-1.18	2

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు

మురళీ 'ఒలింపిక్ కల' చెదిరె

మోకాలి గాయంతో విశ్వక్రీడలకు లాంగ్‌జంపర్ దూరం

ఢిల్లీ : భారత స్టార్ లాంగ్‌జంప్ ప్లేయర్ మురళీ శ్రీశంకర్ ఒలింపిక్స్ కల చెదిరింది. జులై - ఆగస్టులో పారిస్ వేదికగా జరుగబోయే విశ్వక్రీడలకు సన్నద్ధమవుతున్న మురళీకి రెండ్రోజుల క్రితం ప్రాక్టీస్ చేస్తూ మోకాలికి గాయం అవగా, గాయాన్ని పరిశీలించిన వైద్యులు అతడికి శస్త్రచికిత్స అవసరమని తేల్చి చెప్పారు. దీంతో ఒలింపిక్స్‌తో పాటు ఈ సీజన్ మొత్తానికి దూరమైనట్టు అతడు సోషల్ మీడియా పోస్ట్ ద్వారా తెలిపాడు. 'దురదృష్టవశాత్తూ ఇది ఒక పీడకలలా అనిపిస్తోంది. కానీ ఇదే వాస్తవం. నా పారిస్ ఒలింపిక్స్ కల చెదరింది. మంగళవారం ట్రైనింగ్ సెషన్‌లో నా మోకాలికి గాయమైంది' అని రాసుకొచ్చాడు. 2023 ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో శ్రీశంకర్.. 8.37 మీటర్లు దూకి రజత పతకంతో పాటు ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన విషయం తెలిసిందే.

'ఇంపాక్ట్' రూల్‌తో భారత్‌కు నష్టమే : రోహిత్

ఢిల్లీ: ఐపీఎల్‌లో గతేడాది ప్రవేశపెట్టిన 'ఇంపాక్ట్ ప్లేయర్' నిబంధన వల్ల భారత క్రికెట్ జట్టుకు నష్టమేనని టీమిండియా సారథి రోహిత్ శర్మ అన్నాడు. ఈ నిబంధన వల్ల శివమ్ దూబే, వాషింగ్టన్ సుందర్ వంటి భారత ఆల్‌రౌండర్లు బౌలింగ్ చేయలేకపోతున్నారని, వాళ్ల సత్తాకు ఇది అడ్డుకట్ట వేస్తుందని హిట్‌మ్యాన్ అభిప్రాయపడ్డాడు. ఓ యూట్యూబ్ షోలో రోహిత్ మాట్లాడుతూ.. 'క్రికెట్ అనేది 11 మందితో ఆడాలి కానీ 12మందితో కాదు. నాకు ఈ రూల్ నచ్చలేదు. ప్రేక్షకులకు వినోదాన్ని అందించేందుకు ఇలా చేస్తున్నారు. ఈ రూల్ వల్ల భారత జట్టులో వాషింగ్టన్, దూబే వంటి ఆటగాళ్లు బౌలింగ్ చేయడం లేదు. టీమిండియాకు ఇది మంచిది కాదు' అని అన్నాడు. జూన్‌లో జరగాల్సి ఉన్న టీ20 వరల్డ్ కప్‌లో భాగంగా భారత జట్టు సెలక్షన్స్ కోసం రోహిత్.. హెడ్‌కోచ్ ద్రవిడ్, చీఫ్ సెలక్టర్ అగార్కర్ కలిసి సమావేశమయ్యారని వస్తున్న వార్తలను 'ఫేక్ న్యూస్' అని కొట్టిపారేశాడు.

భారత గ్రాండ్‌మాస్టర్లకు నిరాశ

గుకేశ్ గేమ్ డ్రా.. ప్రజ్ఞానంద, విదిత్‌కు ఓటమి

టొరంటో: క్యాండిడేట్స్ చెస్ టోర్నీ 11వ రౌండ్‌లో భారత గ్రాండ్ మాస్టర్లకు నిరాశే ఎదురైంది. ఈ రౌండ్ ముందు వరకూ రష్యా ఆటగాడు ఇయాన్ నెపొనియాచితో సంయుక్తంగా అగ్రస్థానంలో కొనసాగుతూ వచ్చిన దొమ్మరాజు గుకేశ్.. గురువారం టాప్ సీడ్ ఫాబియానా కరువానతో జరిగిన గేమ్‌ను డ్రా చేసుకువడంతో అతడు 6.5 పాయింట్లతో రెండో స్థానానికి పడిపోయాడు. మరో గేమ్‌లో విదిత్ గుజరాతిని ఓడించిన నెపొనియాచి 7 పాయింట్లతో అగ్రస్థానాన్ని ఆక్రమించాడు. అమెరికా ఆటగాడు హికారు నకముురాతో గేమ్‌లో ప్రజ్ఞానంద ఓటమి పాలయ్యాడు.

క్యాన్సర్ పేషెంట్లకు ఫ్రీగా

అహ్మదాబాద్ : క్యాన్సర్, తలసేమియాతో బాధపడుతున్న 12 వేల మంది పేషెంట్లకు ఉచితంగా ఐపీఎల్ మ్యాచ్ చూపించి బీసీసీఐ మంచి మనసు చాటుకుంది. బుధవారం గుజరాత్ టైటాన్స్-ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరిగిన మ్యాచ్‌ను వారితో పాటు రక్తదాతలు, బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఆర్గనైజర్లూ ఉచితంగా వీక్షించారు. క్యాన్సర్, తలసేమియాపై అవగాహన సదస్సులో భాగంగా వచ్చిన వారికి బోర్డు కార్యదర్శి జై షా స్వాగతం పలికాడు.

58 ఏండ్ల వయసులో రిటైర్మెంట్ వెనక్కి!

బ్రెజిల్ ఫుట్‌బాలర్ రొమారియో నిర్ణయం

ఢిల్లీ: బ్రెజిల్ దిగ్గజ ఫుట్‌బాలర్, 1994 ఫిఫా ఫుట్‌బాల్ వరల్డ్ కప్ గెలిచిన జట్టులో సభ్యుడిగా ఉన్న రొమారియో 58 ఏండ్ల వయసులో రిటైర్మెంట్‌ను వెనక్కి తీసుకున్నాడు. బ్రెజిల్‌లోని అమెరికా ఆఫ్ రియో డి జెనీరో క్లబ్‌కు ఓనర్‌గా ఉన్న రొమారియో.. గత కొంతకాలంగా క్లబ్ వరుసగా పరాభవాలు ఎదుర్కొంటూ మనుగడే ప్రశ్నార్థకమవుతున్న నేపథ్యంలో స్వయంగా ఆయనే తిరిగి మైదానంలో దిగేందుకు నడుము బిగించాడు. 2008లో రిటైర్మెంట్ ప్రకటించిన ఈ మాజీ స్ట్రయికర్.. 16 ఏండ్ల తర్వాత తన క్లబ్ తరపున ప్లేయర్‌గా నమోదు చేయించుకున్నట్టు బుధవారం ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వెల్లడించాడు. రొమారియో కొడుకు రొమరిన్హో కూడా అదే జట్టులో ఫార్వర్డ్‌గా ఆడుతున్నాడు. త్వరలో తండ్రీకొడుకులిద్దరూ కలిసి ఆడనుండటం విశేషం.

శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మరో అవార్డు

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 18: శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు మరో అవార్డు వరించింది. తాజాగా 'బెస్ట్ ఎయిర్‌పోర్ట్ స్టాఫ్ ఇన్ ఇండియా అండ్ దక్షిణాసియా 2024' అవార్డును అందుకున్నది. జర్మనీకి చెందిన స్కైట్రాక్స్ ప్రతియేటా ఇచ్చే ఈ అవార్డుకు భారత్ నుంచి జీఎమ్మార్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్(జీహెచ్ ఐఏఎల్) ఎంపికైంది. ఈ నెల 17న జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌లో జరిగిన ప్యాసింజర్ టర్మినల్ ఎక్స్‌పో-2024లో ఈ అవార్డును జీఎమ్మార్ ఎయిర్‌పోర్ట్ సీఈవో ప్రదీప్ పణికర్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ అవార్డు రావడంతో బాధ్యత మరింత పెరిగిందని, ముఖ్యంగా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడానికి ఎల్లప్పుడూ కృషి చేయనున్నట్లు ప్రకటించారు. విమానాశ్రయంలో పనిచేసే ఉద్యోగుల పనితీరు, స్నేహ పూర్వక, సమర్థత ఆధారంగా ఈ అవార్డుకు ఎంపికైంది. విమానాలకు సంబంధించిన సమాచారం అందించడంలో సిబ్బంది చురుగ్గా వ్యవహరించడం, ముఖ్యంగా ఇమ్మిగ్రేషన్, సెక్యూరిటీ స్టాఫ్, షాప్స్, ఫుడ్ అండ్ బేవరేజస్ అవుట్‌లెట్లలో స్టాఫ్ పనితీరు మెరుగ్గావుండటం వల్లనే ఇది సాధ్యమైందని పణికర్ తెలిపారు.

అవార్డును అందుకుంటున్న జీఎమ్మార్ ఎయిర్‌పోర్ట్ సీఈవో ప్రదీప్ పణికర్

ఐదు ఎయిర్‌పోర్ట్‌లకు చోటు

టాప్-100 బెస్ట్ విమానాశ్రయాల్లో దేశానికి చెందిన ఐదింటికి చోటు లభించిందని స్కైట్రాక్స్ విడుదల చేసిన జాబితాలో వెల్లడించింది. వీటిలో ఢిల్లీకి చెందిన ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి 36వ స్థానం వరించింది. అలాగే బెంగళూరు ఎయిర్‌పోర్ట్ 69వ స్థానం నుంచి 59వ స్థానానికి మెరుగుపరుచుకున్నది. అలాగే హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం 61వ స్థానంలో నిలిచింది. గతేడాది ఇది 65గా ఉన్నది. కానీ, ముంబై ఎయిర్‌పోర్ట్ ర్యాంక్ మాత్రం 84వ స్థాయి నుంచి 95కి పడిపోయింది. తొలిసారిగా గోవాలోని మనోహర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కు చోటు లభించింది.

విస్తరణ బాటలో పోల్‌మోర్ స్టీల్

హైదరాబాద్, ఏప్రిల్ 18: రైల్వే కంపెనీలకు కీలకమైన విడిభాగాలు తయారు చేసి అందిస్తున్న పోల్‌మోర్ స్టీల్.. రాష్ట్రంలో తన వ్యాపారాన్ని మరింత విస్తరించడానికి సిద్ధమైంది. మెదక్ జిల్లాలోని కాళ్లకల్ వద్ద ఉన్న స్టీల్ ప్లాంట్‌ను భారత్‌లో ఉన్న పోలాండ్ రాయబారి డాక్టర్ సెబాస్టియన్ డోమ్‌జలస్కి గురువారం సందర్శించారు. ఆయనతోపాటు పోలాండ్ కాన్సుల్ జనరల్ అలెక్సాండర్ దండా కూడా ఉన్నారు. ఈ సందర్భంగా పోల్‌మోర్ స్టీల్ మేనేజింగ్ డైరెక్టర్ కేవీఆర్ సుబ్బారావు మాట్లాడుతూ..దేశీయంగా స్టీల్ ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని కాళ్లకల్ వద్దవున్న ప్లాంట్‌కు అనుకొని మరో మూడు ఎకరాల విస్తీర్ణంలో మరో యూనిట్‌ను నెలకొల్పుతున్నట్లు చెప్పారు. 2.5 మిలియన్ యూరోల పెట్టుబడి(రూ.20 కోట్లకు పైగా)తో ఏర్పాటు చేస్తున్న ఈ యూనిట్‌తో మరో 100 మందికిపైగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు.

ఈవీ పాలసీ సమావేశానికి టెస్లా హాజరు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: భారతీయ నూతన విద్యుత్తు ఆధారిత వాహనాల విధానంపై గురువారం జరిగిన భాగస్వాముల సమావేశంలో టెస్లా సలహాదారు పాల్గొన్నారు. దేశంలో అమల్లోకి తేనున్న ఈ కొత్త ఎలక్ట్రిక్ వెహికిల్స్ (ఈవీ) పాలసీకి సంబంధించి మార్గదర్శకాల కోసం ఆటోమొబైల్ ఇండస్ట్రీ వర్గాల నుంచి కేంద్ర ప్రభుత్వం అభిప్రాయాలను తీసుకుంటున్నది. ఈ క్రమంలోనే ఆయా ఈవీల తయారీ సంస్థలతో సంప్రదింపులు జరుపుతుండగా, టెస్లా తరపున ఆ సంస్థ సలహాదారు (ది ఆసియా గ్రూప్) కూడా పాలుపంచుకున్నట్టు ఓ ఉన్నతాధికారి తెలిపారు. టెస్లా అధినేత ఎలాన్ మస్క్.. భారత్‌లో పర్యటిస్తున్న క్రమంలో ఇది ప్రాధాన్యతను సంతరించుకున్నది. కాగా, వియత్నాంకు చెందిన ఎల్‌క్ట్రిక్ వెహికిల్స్ తయారీదారు విన్‌ఫాస్ట్ కూడా ఈ సమావేశానికి హాజరైంది. అలాగే మారుతీ సుజుకీ, హ్యుందాయ్, టాటా మోటర్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, కియా, స్కోడా ఆటో, ఫోక్స్‌వాగన్, రెనాల్ట్, మెర్సిడెస్ బెంజ్, బీఎండబ్ల్యూ, ఆడీ కంపెనీల ప్రతినిధులూ హాజరైనట్టు సంబంధిత వర్గాలు చెప్తున్నాయి. ఈ సందర్భంగా కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ.. కొత్త ఈవీ పాలసీ వివరాలను ఆయా సంస్థల ప్రతినిధులకు తెలియపర్చింది. కాగా, ఈ నెల 22తో మొదలయ్యే వారంలో మస్క్, మరికొందరు టెస్లా ఉన్నతాధికారులు భారత్‌కు రానున్నారు.

9.30 లక్షల కోట్లు ఫట్

- నాలుగు రోజులుగాకరిగిపోతున్న మదుపరుల సంపద
- వరుస నష్టాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు
- సెన్సెక్స్ 455, నిఫ్టీ 152 పాయింట్లు పతనం
- 3 నిమిషాల్లోనే 319 పాయింట్లు దిగిన బీఎస్ఈ ప్రధాన సూచీ

ముంబై, ఏప్రిల్ 18: వరుస లాభాలతో రికార్డుల్ని సృష్టించిన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ఇప్పుడు వరుస నష్టాలతో అల్లాడిపోతున్నాయి. నాలుగు రోజులుగా సూచీలు పతనం దిశగానే అడుగులు వేస్తుండటంతో లక్షల కోట్ల రూపాయల్లో మదుపరుల సంపద ఆవిరైపోయింది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ)లో నమోదైన సంస్థల మార్కెట్ విలువ గత నాలుగు ట్రేడింగ్ సెషన్లలో రూ.9,30,304.76 కోట్లు హరించుకుపోయింది. అంతకుముందు రూ.400 లక్షల కోట్లకుపైనే ఉండటం గమనార్హం. కానీ ఇప్పుడు రూ.3,92,89,048.31 కోట్లుగానే ఉన్నది. హెవీ వెయిట్ షేర్లతోపాటు మిడ్, స్మాల్‌క్యాప్ సూచీల్లోని షేర్లూ అమ్మకాల ఒత్తిడికి లోనవుతుండటంతో మార్కెట్లు నిలబడలేకపోతున్నాయి. ఈ క్రమంలోనే ఆయా సంస్థల మార్కెట్ విలువ కూడా అంతకంతకూ దిగజారిపోతున్నది.

తీవ్ర ఒడిదొడుకులు

మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపుతుండటంతో సూచీలు వరుస నష్టాలకు లోనవుతున్నాయి. గురువారం బీఎస్ఈ సూచీ సెన్సెక్స్ 454.69 పాయింట్లు లేదా 0.62 శాతం పడిపోయి 72,488.99 వద్ద స్థిరపడింది. ఒకానొక దశలో 1,107.38 పాయింట్లు కోల్పోవడం గమనార్హం. కాగా, మధ్యాహ్నం వేళ ఇన్వెస్టర్లు ఒక్కసారిగా పెట్టుబడుల ఉపసంహరణకు దిగారు. దీంతో కేవలం 3 నిమిషాల్లోనే సెన్సెక్స్ ఏకంగా 319 పాయింట్లు దిగజారింది. 1:31 నిమిషాలకు 73,135.50 వద్ద ఉన్న సెన్సెక్స్.. 1:34 నిమిషాలకు 72,817.03 వద్దకు పడింది. మార్కెట్‌లో నెలకొన్న హెవీ సెల్లింగ్ ప్రెషర్‌కు ఇది అద్దం పడుతున్నది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ కూడా 152.05 పాయింట్లు లేదా 0.69 శాతం క్షీణించి 22 వేల స్థాయికి దిగువన 21,995.85 వద్ద నిలిచింది. ట్రేడింగ్ సమయంలో గరిష్ఠ స్థాయి 22,326.50, కనిష్ఠ స్థాయి 21,961.70 మధ్య సూచీ ఊగిసలాడటం.. తీవ్ర ఒడిదొడుకులకు నిదర్శనంగా నిలుస్తున్నది.

నెస్లే షేర్లు ధమాల్

నెస్లే షేర్లు భారీ నష్టాలను చవిచూశాయి. భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో చిన్నారుల కోసం నెస్లే అమ్ముతున్న పాల ఉత్పత్తుల్లో చక్కెర స్థాయిలు మోతాదుకు మించి ఉన్నాయన్న వార్తలతో ఒక్కసారిగా అలజడి చెలరేగింది. ఈ నేపథ్యంలోనే ఒక్కరోజే 3 శాతానికిపైగా నెస్లే షేర్ విలువ క్షీణించింది. ఇన్వెస్టర్లు పెద్ద ఎత్తున షేర్లను వదిలించుకునే దిశగా వెళ్లారు. ఫలితంగా సంస్థ మార్కెట్ విలువ రూ.8,137.49 కోట్లు తగ్గి రూ.2,37,447.80 కోట్లకు పరిమితమైంది. బీఎస్ఈలో 3.31 శాతం దిగజారి రూ.2,462.75 వద్ద ముగిసింది. ఒకానొక దశలో 5.40 శాతం పడిపోవడం గమనార్హం. అటు ఎన్ఎస్ఈలోనూ 2.94 శాతం పతనమై రూ.2,471 వద్ద ఉన్నది. అయితే గత ఐదేండ్లలో తమ బేబీ ఫుడ్ ఉత్పత్తుల్లో యాడెడ్ షుగర్స్‌ను 30 శాతం మేర తగ్గించామని నెస్లే ఇండియా చెప్తున్నది. ఇదిలావుంటే బ్యాంకింగ్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, చమురు-గ్యాస్, ఆటో, రియల్టీ, కమోడిటీస్ షేర్లలో సెల్లింగ్ ప్రెషర్ బాగా కనిపించింది. బీఎస్ఈ మిడ్, స్మాల్‌క్యాప్ సూచీలూ 0.39 శాతం, 0.06 శాతం చొప్పున నష్టపోయాయి.

వరుస నష్టాలకు కారణాలు

- ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల కోతలపై సన్నగిల్లుతున్న ఆశలు
- లాభాల స్వీకరణ దిశగా మదుపరులు
- ఒత్తిడిలో కీలక రంగాల షేర్లు
- తరలిపోతున్న విదేశీ పెట్టుబడులు
- అంతర్జాతీయ ఉద్రిక్తతలు

మ్యాగ్నైట్ రీకాల్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: నిస్సాన్‌కు చెందిన మ్యాగ్నైట్ మాడల్ కార్లను రీకాల్ చేస్తున్నట్లు ప్రకటించింది. నవంబర్ 2020 నుంచి డిసెంబర్ 2023లోపు తయారైన మ్యాగ్నైట్ మాడళ్లలో ముందు డోరు హ్యాండిల్ సెన్సార్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో వీటిని వెనక్కి పిలిపిస్తున్నట్లు తెలిపింది. ఎన్ని యూనిట్లను రీకాల్ చేస్తున్న విషయాన్ని మాత్రం సంస్థ వెల్లడించలేదు. కానీ, గతేడాది డిసెంబర్ తర్వాత తయారైన మాడళ్లలో ఎలాంటి సమస్యలు రాలేవని స్పష్టంచేసింది. ఇప్పటికే ఈ విషయాన్ని కారు కొనుగోలు చేసిన వారికి సమాచారం ఇచ్చినట్లు, ఉచితంగా వీటికి మరమ్మతులు చేసి ఇవ్వనున్నట్లు తెలిపింది.

రాణించిన ఇన్ఫోసిస్

- క్యూ4లో రూ.7,969 కోట్ల లాభం
- రూ.28 మధ్యంతర డివిడెండ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన ఇన్ఫోసిస్ అంచనాలకుమించి రాణించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో సంస్థ రూ.7,969 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.6,128 కోట్ల లాభంతో పోలిస్తే 30 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 1.3 శాతం ఎగబాకి రూ.37,441 కోట్ల నుంచి రూ.37,923 కోట్లకు చేరుకున్నది.

- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆదాయంలో వృద్ధి 1-3 శాతంగా ఉంటుందని తన గైడెన్స్‌లో పేర్కొంది.
- 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్త